క్లుప్తంగా

ఆత్మకూరు డివిజన్‌లో 138 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలో గడిచిన 24 గంటల్లో మంగళవారం ఉదయానికి 138.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఆర్డీఓ కార్యాలయ అధికారులు తెలిపారు. అత్యధికంగా మండలంలో 39.2 మి.మీ., కలువాయి 37, ఆత్మకూరు 13.6, అనంతసాగరం 25.4, ఉదయగిరి 12.2, సంగం 7.8, మర్రిపాడు 2.2, ఏఎస్‌పేట 1.1 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు.

విద్యుత్ శాఖ ఏఈగా మన్మథరావు


ఏఈ మన్మథరావు

ఆత్మకూరు:పట్టణ విద్యుత్‌శాఖ ఏఈగా యు మన్మథరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జి ఏఈగా లావణ్య ఉన్న విషయం తెలిసిందే. నెల్లూరులో విధులు నిర్వహిస్తున్న ఆయన్ను బదిలీల్లో భాగంగా ఆత్మకూరు ఏఈగా బదిలీ చేశారు. ఆయన డీఈఈ జనార్దనరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రజలకు అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

పశుపోషకులకు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న శశిధర్

ఉదయగిరి: పశువైద్య సిబ్బంది గ్రామాల్లో పశుపోషకులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఉదయగిరి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు శశిధర్ అన్నారు. ఆయన మంగళవారం పట్టణంలోని బిట్-1 రైతు భరోసా కేంద్రంలో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబరు చివరి నాటికి పశుపోషకులకు పశుసంరక్షణ కార్డుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఉదయగిరి, సీతారామపురం మండలాలకు సంబంధించి 4,850 పశు సంరక్షణ కార్డులు వచ్చాయన్నారు. బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలను ముందస్తుగా 4 నుంచి 8 నెలల ఆడ దూడలను గుర్తించి వేయాలన్నారు. అన్ని రకాల టీకాలను సకాలంలో పశువులకు, జీవాలకు వేసి నూరు శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ సమావేశంలో పశు వైద్యాధికారులు అనూష, వినయ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలు సామాజిక నేరం

ఆత్మకూరురూరల్: బాల్య వివాహాలు ఆధునిక కాలంలో సామాజిక నేరంగా పరిగణించబడుతున్నాయని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి బాల్య వివాహాలు నిరోధక కమిటీ సమావేశం జరిగింది. ఎంపీడీఓ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు గర్భిణులకు, బాలింతలకు 2006 వివాహ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. 12 నుంచి 18 ఏళ్ల లోపు బాలబాలికల వివరాలు సేకరించి వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ హెల్ప్ లైన్ నంబరు 1098 ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలన్నారు. పంచాయతీ స్థాయిలో మహిళా పోలీసులు, గ్రామ కమిటీలు ప్రతి శనివారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి నివేదికలు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారులకు అందజేయాలన్నారు. వైద్యాధికారి అనూషా, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శ్రీహరి, పెంచలనరసయ్య, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాపై శిక్షణ

సంగం: స్థానిక జెడ్పీ హైస్కూల్లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై ఎంఈఓ జానకీరాం పాఠశాల పీడీలతో కలిసి సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు మంగళవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడా పోటీలకు సంబంధించి విధివిధినాలపై అవగాహన కల్పించారు. ప్రతి సచివాలయం పరిధిలో ఆడుదాం ఆంధ్ర రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 మల్లయ్య, హెచ్‌ఎం బుజ్జయ్య పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో 'కేకేఆర్స్' ప్రతిభ


విద్యార్థులకు అభినందన

నెల్లూరు (టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో కేకేఆర్స్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని స్కూల్ డైరెక్టర్ ప్రసాద్‌రావు పేర్కొన్నారు. నగరంలోని దిశ పోలీస్‌స్టేషన్లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఏఎస్పీ ప్రసాద్ అభినందించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడారు. సాఫ్ట్ టెన్నిస్ సబ్ జూనియర్స్ సింగిల్స్ పోటీల్లో సుధన్‌రవినందన్ తృతీయ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. యోగాలో సంతోష్ ద్వితీయ.. అండర్ - 14 స్విమ్మింగ్ పోటీల్లో అక్షణ ప్రథమ స్థానంలో నిలిచి జాతీయ పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. డీన్ సత్యరామ్ పాల్గొన్నారు.

సంక్షేమం జగనన్నతోనే సాధ్యం

నాలుగున్నరేళ్లుగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు క్రమం తప్పకుండా అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, మరోసారి ముఖ్యమంత్రి అయితే ప్రజల సంక్షేమం సాధ్యమవుతుందని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు చెప్పారు. అనేక సంక్షేమ పథకాల ద్వారా అవినీతి తావు లేకుండా నేరుగా ప్రజలకు అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఒక్కొక్క పంచాయతీలో రూ.కోట్లాది రూపాయలు సంక్షేమం, అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్లు గుర్తు చేశారు.


ఉదయగిరి: సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి, జెడ్పీటీసీ మోది రామాంజనేయులు, మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి, ఈఓపీఆర్డీ మల్లికార్జున, దాసరపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు నారపరెడ్డి, చేజర్ల సుధాకర్‌రెడ్డి తదితరులు


దుత్తలూరు: లక్ష్మీపురంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనరు అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ యనమల సుబ్బమ్మ, సొసైటీ డైరెక్టర్ దేవరపాటి సురేంద్ర, సచివాలయ కన్వీనర్లు చుండి నాగార్జున, శిముని మాధవి, వనిపెంట మధు, నాయకులు చుండి వెంకటేశ్వర్లు, రామిరెడ్డి బ్రహ్మారెడ్డి, వెంగళరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు


జలదంకి: తిమ్మసముద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సర్పంచ్ రావి ప్రసాద్‌నాయుడు, ఎంపీడీఓ సింగయ్య, నాయకులు వల్లంరెడ్డి నరసారెడ్డి, తమ్మినేని సతీష్, ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, గుర్రం జగ్గయ్య తదితరులు


అనుమసముద్రంపేట: కొండమీదకొండూరులో పార్టీ జెండాను ఎగురవేస్తున్న సర్పంచ్ గోసాల సరస్వతమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ పులిమి వెంకటరమేష్‌రెడ్డి, మురళీరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు


మర్రిపాడు: బూదవాడలో జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, సర్పంచ్ హరిబాబు, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, శివసాయి తదితరులు


చేజర్ల: సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పార్టీ జిల్లా ఈసీ మెంబర్ పోలంరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పూనూరు బాలగంగాధర్‌రెడ్డి సర్పంచ్ కొమ్మల నరసయ్య, ఉపసర్పంచ్ రామకృష్ణారెడ్డి, నాయకులు వెన్నపూస పెంచలరెడ్డి, శంకర్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, వరదారెడ్డి తదితరులు


ఆత్మకూరురూరల్: రామస్వామిపల్లిలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించిన ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ అధ్యక్షుడు సానా వేణుగోపాల్‌రెడ్డి, ఏఓ శ్రీనివాసులు, కార్యదర్శి కార్తీక్, వీఆర్‌ఓ రమణయ్య తదితరులు


కలిగిరి: గుడ్లదొనలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న పార్టీ మండల అధ్యక్షుడు కాటం రవీంద్రారెడ్డి, ఎంపీడీఓ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ త్రోవగుంట రాఘవయ్య, పీఏసీఎస్ చైర్మన్ దగుమాటి ఆదిశేషారెడ్డి, ఎంపీటీసీ పందల శ్రీనివాసులు, సచివాలయ కన్వీనరు కోట కిషోర్‌రెడ్డి తదితరులు


అల్లూరు: అల్లూరు-1 సచివాలయంలో పథకాల బోర్డును ఆవిష్కరించిన పార్టీ జిల్లా కమి సభ్యుడు నీలం సాయికుమార్ స్థానిక నాయకులు షేక్ ఉస్మాన్, మోహన్‌రెడ్డి, భక్తవత్సలరెడ్డి, భాస్కర్, మల్లి, సుధ, రసూల్, మాధవ్, జంషీర్, రసూల్, శ్రీను తదితరులు


సంగం: మర్రిపాడులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ సురేష్, ఈఓపీఆర్డీ రమేష్, నాయకులు

కమిటీలతో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు

- సమగ్రశిక్ష అభియాన్ నోడల్ అధికారి మూర్తి


మాట్లాడుతున్న నోడల్ అధికారి మూర్తి

ఆత్మకూరు: ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా అంగన్‌వాడీలకు సొంత భవనాలను నిర్మించనుందని, అయితే వాటిని కాంట్రాక్టర్లతో కాకుండా కమిటీల ద్వారా నిర్మించుకోవాల్సి ఉందని, సమగ్ర శిక్ష అభియాన్ నోడల్ అధికారి కె.మూర్తి తెలిపారు. ఆత్మకూరు క్లస్టర్ పరిధిలోని ఐదు మండలాల్లో పది అంగన్‌వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరు అయ్యాయని వివరించారు. వాటి నిర్మాణం కోసం అనుసరించాల్సిన విధి విధానాలపై మున్సిపల్ కార్యాలయం ఎంజీఆర్ సమావేశ మందిరంలో మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ రత్నమ్మ ఆధ్వర్యంలో ఆత్మకూరు, అనంతసాగరం, చేజర్ల, సంగం, ఏఎస్‌పేట మండలాల అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు కె మూర్తి, టి నేతాజీ మాట్లాడుతూ ఒక్కో భవన నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. జిల్లాలో 959 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయన్నారు. మన అంగన్‌వాడీ, నాడు-నేడు పథకం ద్వారా నిర్మించబడే నూతన భవనాల నిర్మాణానికి అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రుల కమిటీ, విద్యా కమిటీ, స్థానిక గ్రామస్తుడు ఇలా ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసుకుని వారి ఆధ్వర్యంలో నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కేశవ నారాయణమ్మ, పద్మావతి, రమాదేవి, ఏ శారద, సురేఖ, కస్తూరి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

సంగం: గ్రామాల్లో మౌలిక సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని ఎంపీపీ కంటాబత్తిన పద్మావతమ్మ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మండలంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులు శాఖల వారీగా వివరించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో సమస్యల అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ పద్మావతమ్మ మాట్లాడుతూ ప్రజల అవసరాలు తీర్చడానికి, మౌలిక పరమైన వసతులు కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందని, ప్రాధాన్యతా క్రమంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.


పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వేకు ప్రజాప్రతినిధులు సహకరించి విజయవంతంగా జరిగేలా చూడాలని తహసీల్దారు నాగరాజు ప్రజా ప్రతినిధులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గోపీ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం


ఆత్మకూరు: పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర ఆలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పార్వతి, పరమేశ్వరుల ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి ఆలయ ప్రాంగణంలోని ప్రత్యేక వేదికపై చేర్చారు. అర్చకులు మేళ్లచెరువు శివకుమారశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణ ఘట్టాన్ని వివరిస్తూ కల్యాణం జరిపించారు.

అప్రమత్తతతో రోడ్డు ప్రమాదాల నియంత్రణ

- ఎంవీఐ ఎం.రాములు



ఆత్మకూరు కళాశాలలో రోడ్డు ప్రమాదాలపై వివరిస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు: ప్రయాణంలో అప్రమత్తంగా వ్యవహరిస్తే రోడ్డు ప్రమాదాలు జరగవని ఆ విషయంలో సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా యువత, విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని రోడ్డు ప్రమాదాలు నివారించడంలో చొరవ చూపాలని ఆత్మకూరు ఎంవీఐ ఎం.రాములు అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఎస్‌ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జరిగిన ప్రమాదాలను పరిశీలిస్తే కేవలం అజాగ్రత్తతోనే ప్రమాదాలకు గురై విలువైన ప్రాణాలను కోల్పోయినట్లు రుజువైందన్నారు. కార్యక్రమంలో కళాశాలకు ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, అధ్యాపకుడు కొండా వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు పునః పరిశీలన ప్రక్రియ పరిశీలన


సంగం: సంగంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న ఓటర్ పునః పరిశీలన ప్రక్రియను ఆత్మకూరు ఆర్డీఓ కురబ మధులత మంగళవారం తనిఖీ చేశారు. తహసీల్దారు నాగరాజు, బీఎల్‌ఓలతో కలిసి ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. కొత్తగా ఓటు నమోదు, మృతుల ఓట్లు తొలగింపుపై విచారించారు.

రాష్ట్రంలో ప్రజాదరణ పాలన


లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలను ఆదరించే విధంగా పరిపాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేశారని, అదే చంద్రబాబు పాలనలో ప్రజలను అణిచివేసే పాలన జరిగిందని ప్రజలు ఈ రెండు ప్రభుత్వాల మధ్య తేడాను గుర్తించారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని 21వ వార్డులో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ముందు ఎందుకు పనికిరాని నాయకుడు చంద్రబాబు అని, అణగారిన వర్గాలను మరింతగా అణిచి పెట్టాలని చూసిన దుర్మార్గుడని చెప్పారు. పేద వర్గాలను అక్కున చేర్చుకుని, వారి స్థాయిని పెంచాలని చూస్తున్న మనసున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. పేదవాడి పిల్లాడు పేదవాడి గానే ఉండకూడదని, కార్మికుడి కొడుకు కార్మికుడిగానే ఉండిపోకూడదని తక్కువ వృత్తుల్లో ఛిద్రమైన తల్లిదండ్రుల్లానే వారి పిల్లలు కాకూడదన్న ఆలోచనతో జగనన్న ఒక మామలా చదివిస్తున్నాడన్నారు. విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులతో పేద పిల్లలకు ఇంగ్లిష్ చదువులు అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. సంక్షేమ పథకాలతో ఆర్థిక స్వావలంబన దిశగా పేద వర్గాలను నడిపిస్తున్న సీఎం జగనన్న అని చెప్పారు. ఆ ప్రాంతానికి చెందిన మద్దిల రాజగోపాల్, మరో 10 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవిరెడ్డి, షేక్ చెన్నయ్య, జలదంకి కొండయ్య పురిణి కోదండం, షేక్ పార్థు, సిద్ధవరం స్వర్ణలత పాల్గొన్నారు.

ప్రతి గడపలో జగనన్నకు ఆశీర్వాదాలు


పథకాల లబ్ధి బుక్‌లెట్లను అందజేస్తున్న శ్రీనివాసులునాయుడు, సోమల మాధవరెడ్డి

మర్రిపాడు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి గడపలో పర్యటిస్తున్న సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన ఫలాలు అందుకున్న ప్రతి ఒక్కరూ జగనన్నను ఆశీర్వదిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు అన్నారు. మంగళవారం మర్రిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి బుక్‌లెట్లను అందజేశారు. సంక్షేమ ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఆశీర్వదిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. భీమవరం సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి, ఎంపీడీఓ పరిమి నాగమణి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, గృహసారథులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు


పెరటి తోటలను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం, పలు శాఖల అధికారులు, రైతులు

ఆత్మకూరురూరల్: తక్కువ పెట్టుబడులతో రసాయన రహితంగా సాగు చేసే ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ఐకేపీ ఏపీఎం వెంకాయమ్మ అన్నారు. మండలంలోని కరటంపాడులో సాగులో ఉన్న ప్రకృతి వ్యవసాయ పంటలను సోమవారం ప్రకృతి వ్యవసాయం అధికారులు, రైతులతో కలిసి ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఆమె మాట్లాడుతూ ఏటీఎం మోడల్ విధానం ద్వారా 20 సెంట్ల భూమిలో 25 నుంచి 30 రకాల కూరగాయలు పండించవచ్చన్నారు. తీగజాతి, గడ్డ జాతి, ఇతర రకాల సాగు ద్వారా అధిక ఆదాయం పొందేందుకు అవకాశం ఉందన్నారు. ప్రతి కుటుంబంలోని వారు పెరటి తోటలు పెంచడం ద్వారా నాణ్యమైన కూరగాయలు పండించడంతో పాటు వాటిని విక్రయించడం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. తక్కువ నీటి ఖర్చు, ఎక్కువ ఆదాయంతో సాగు చేసిన రైతులు లబ్ధి పొందుతారన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మి, సుబ్బరాయుడు, సీసీలు మాలకొండయ్య, శ్రీను, విజయమ్మ, అమరావతి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ఆత్మకూరు: ఎలాంటి పురుగు మందులు ఉపయోగించని పంట ఉత్పత్తులకు అధిక డిమాండ్ ఉందని ప్రకృతి వ్యవసాయంతోటే అది సాధ్యమని ప్రకృతి వ్యవసాయ (ఏపీసీఎంఎఫ్) కన్వీనర్ వెంకటలక్ష్మి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ ఐకేపీ (వెలుగు) కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సమావేశం నిర్వహించారు. వెంకటలక్ష్మి మాట్లాడుతూ పొదుపు మహిళలు అవగాహన పెంచుకుని క్షేత్రస్థాయిలో రైతులను ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. భూసారం పెంచేందుకు పశువుల ఎరువు, పచ్చిరొట్ట పైర్లు వేయాలన్నారు. పచ్చిరొట్ట పైర్లు సాగుతో నత్రజని పెరిగి సాగు ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బి.వెంకమ్మ, వెలుగు ఫైనాన్స్ ఏపీఎం శేషమ్మ, సిబ్బంది అమరావతి, కిన్నెర పాల్గొన్నారు.

బడుగుల విద్యా 'జ్యోతి' రావు పూలే

శతాబ్ద కాలం క్రితమే బడుగు, బలహీన వర్గాలు, దళితులకు చదువుతోనే అభివృద్ధి సాధ్యమని గుర్తించి ఆ మేరకు దళితుల విద్య కోసం విశేష కృషి చేసిన తొలి వ్యక్తి జ్యోతిరావు పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. జ్యోతిరావుపూలే 133వ వర్ధంతిని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించారు.


ఆత్మకూరు: ఎమ్మెల్యే కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, కౌన్సిలర్ మొలబంటి రాజశేఖర్, నాయకులు తదితరులు


మర్రిపాడు : ఎంపీడీఓ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ మండల కన్వీనర్ శ్రీనివాసులునాయుడు, సొసైటీ చైర్మన్ సోమల మాధవరెడ్డి తదితరులు


అనుమసముద్రంపేట: తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు లక్ష్మీనరసింహం, సిబ్బంది


ఆత్మకూరురూరల్: పూలే చిత్రపటానికి నివాళులర్పించిన తహసీల్దారు జగదీష్‌బాబు, డీటీ రాజేష్, పృథ్వీకుమార్ తదితరులు


అల్లూరు: ప్రభుత్వాసుపత్రిలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

నాణ్యత లేని తినుబండారాల విక్రయాలపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫోరం సభ్యులు

వరికుంటపాడు: మండలంలో వస్తువులు అధిక ధరలకు విక్రయాలు, నాణ్యత లేని తినబండారాల అమ్మకాలపై ఏపీ కన్స్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం మండల సభ్యులు మంగళవారం తహసీల్దార్ ఎస్.మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. మండలంలో పలువురు కిరాణా, కూల్ డ్రింక్స్ వ్యాపారులు అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారన్నారు. పాఠశాలలు, గృహ నివాసాల సమీపాల్లో నాణ్యత లేని తినుబండారాలు చేసి విక్రయాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. ఫోరం రాష్ట్ర ఈసీ మెంబర్ చల్లగాలి వెంకట్‌మోహన్, జనరల్ సెక్రెటరీ పి.మల్లికార్జున, మండల ఈసీ మెంబర్లు వై.సూర్యనారాయణ, ఎస్.మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహం తరలింపుపై వివాదం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ వద్ద రెండు దశాబ్దాలుగా చిరు వ్యాపారాలు (పూసలు, దండలు) వ్యాపారంతో జీవనం సాగించే నక్కలోళ్ల కుటుంబానికి చెందిన మహిళ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. అయితే ఇంటి వసతి లేకపోవడంతో బస్టాండ్ వద్దనే మృతదేహాన్ని పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు సిబ్బందిని పంపి మృతదేహాన్ని అక్కడి నుంచి తరలించాలని చెప్పడంతో వివాదం నెలకొంది. బస్టాండ్ ప్రాంతంలో మృతదేహం ఎక్కువ సేపు ఉంటే ప్రయాణికులకు, ప్రజలకు ఇబ్బంది అని సిబ్బందిని పంపారు. మృతురాలి కుమార్తె దూరప్రాంతంలో ఉండడంతో ఆమె వచ్చే వరకు అవకాశమివ్వాలని కుటుంబీకులు వేడుకొన్నారు. కమిషనర్ అభ్యంతరం పెట్టడంతో సీపీఎం నాయకులు అక్కడికి చేరుకుని కమిషనర్‌తో వాగ్వాదానికి దిగారు. చివరకు మృతదేహాన్ని పాతాస్పత్రి సమీపానికి చేర్చి చుట్టూ పట్టలు కట్టడంతో వివాదం సద్దుమణిగింది.

బీఎల్వోలు బాధ్యతగా పనిచేయాలి


ఉదయగిరి: మండలంలోని బీఎల్వోలు బాధ్యతగా పని చేయాలని తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరితో ఓటు నమోదు చేయాలన్నారు. చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీ ఓట్లను గుర్తించి తొలగించాలన్నారు. ఒకే కుటుంబంలోని ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. డీటీ ఫాజిహా, సీనియర్ సహాయకుడు, సంధానీ తదితరులు పాల్గొన్నారు.